సాక్షి
కర్నూలు
సోమవారం ၊ 30 ၊ జూన్ ၊ 2025



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం విజయవాడకు చెందిన యుద్దనపూడి మాధురి జ్యోత్స్న రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో రోజురోజుకూ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు ఆదివారం 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.



రాఘవుడి దర్శనానికి దారేది?

శ్రీమఠం అధికారుల తీరు భక్తుల తోపులాటకు దారి తీసింది. సింగిల్ ఎంట్రెన్స్ భక్తులకు ముచ్చెమటలు తెప్పించింది. వృద్ధులు, చిన్నారులను కన్నీళ్లు పెట్టించింది.

8లో▸

న్యూస్‌రీల్

నేడు సచివాలయ ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): సాధారణ బదిలీల్లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే ఏఎన్‌ఎంలకు సోమవారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు ర్యాంకు ఆధారంగా ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 2019 అక్టోబర్ 2న కొందరికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారన్న విషయమై అధికారులు వివరణ ఇస్తూ ఎస్‌ఆర్‌లో వారి డేట్ ఆఫ్ జాయినింగ్ 2019 అక్టోబర్ 3వ తేదీగా ఉందని, ఆ రోజు నుంచి వారిని పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుంగిన ఎల్లెల్సీ గట్టు



హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) 209 కి.మీ వద్ద గట్టు లైనింగ్ కుంగిపోయింది. ఆ ప్రాంతంలో ఆధునీకీకరణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం వద్ద వరకు రాలేదు. వచ్చే నెల 10న కాలువకు నీటిని విడుదల చేస్తుండడంతో కుంగిన ప్రాంతం వద్ద గట్టుకు గండి పడితే సమస్య పెద్దగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోసాలకు చిరునామా బాబు!

- ఏడాది పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదు
- 'సూపర్ సిక్స్' అంటూ వంచన చేశారు
- మేనిఫెస్టో అమలు చేయలేదు
- జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించాలి
- విడతల వారీగా 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న పార్టీ పరిశీలకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు విరూపాక్షి, బాలనాగిరెడ్డి, మేయర్ బీవై రామయ్య తదితరులు

కర్నూలు(టౌన్): ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసాలకు చిరునామా మారారని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రాంచంద్రా రెడ్డి విమర్శించారు. ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఎన్నికల సమయంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' అని మాటఇచ్చి నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'గా మారారన్నారు. కర్నూలు బిర్లా సర్కిల్‌లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' పేరుతో క్యూఆర్ కోడ్ అవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు చేసిన మోసాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడిన వీడియోను సమావేశంలో ప్రదర్శించారు.

మహిళలకు ఉచిత బస్సు ఏదీ?

వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని తేలిపోయిందన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి పేదలు, మహిళలు మోసపోయామని అర్థమైందన్నారు. జగనన్న హయాంలో ఏటా రూ. 70 వేల కోట్లు ప్రతి పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు, మహిళలకు నేరుగా వారి అకౌంట్లలో జమ చేశారని గుర్తు చేశారు. ఏడాది పాలనలో ఏ ఒక్క హామీ అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇప్పటికీ అమలులోకి రాలేదని విమర్శించారు.

ఇంటింటికీ మోసం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇంటింటికీ మోసం చేశారన్నారు. మోసాలను గ్రామా గ్రామానా వివరిద్దామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ. 1500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను రూ. 4 వేలు పెన్షన్, నిరుద్యోగులకు రూ. 3 వేలు, అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, గ్రామ స్థాయిలో కమిటీల నియామకాన్ని పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ మోసాలను వివరిస్తామన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీల పేరుతో ఇంటింటికి రూ.2.40 లక్షల లబ్ధి పొందుతారని చెప్పి దగా చేశారని విమర్శించారు.

హాజరైన ఎమ్మెల్యేలు

సమావేశంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, హఫీజ్‌ఖాన్, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి ,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, గద్దం రామక్రిష్ణారెడ్డి, రుద్రగౌడ్, పార్టీ ఉపాధ్యక్షులు అహమ్మద్ అలీఖాన్, షరీఫ్, అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కల్లా నాగవేణి రెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, మంగమ్మ, భారతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, కార్పొరేటర్లు షేక్ యూనిస్ బాషా, సిట్రా సత్యనారాయణమ్మ, షేక్ ఆర్షియా ఫర్హీన్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జమిలీ ఎన్నికలు 2027 సంవత్సరంలో వస్తున్నాయని, పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పనిచేసి జగనన్నను గెలిపించుకుందామని మాజీ మంత్రి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు ఏడాది పాలనపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. 'సూపర్ సిక్స్' అంటూ ప్రజలను వంచన చేశారని, ఈ విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికల సమయంలో 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు ఆశలు కల్పించి దగా చేశారని విమర్శించారు. అరకొరగా తల్లికి వందనం నిధులు వేసి ఎవరైనా ఈ పథకం గురించి మాట్లాడితే నాలుక మడత పెడతామంటూ బెదిరించడం ముఖ్యమంత్రి స్థాయిలో తగదన్నారు. ప్రజలు చూస్తూ ఊరుకోబోరన్న విషయాన్ని చంద్రబాబు గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి చేసిన మోసాలను జిల్లా స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదిలో ప్రజలకు ఎలాంటి లబ్ధిని చేకూర్చిందో తెలియజేయాలన్నారు.

తీవ్ర ఇబ్బందుల్లో రైతులు

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. సంవత్సరం కాలంగా చంద్రబాబు ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చేంత వరకు ఈ ప్రభుత్వాన్ని వదిలేది లేదన్నారు.
- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన విధానాన్ని ఎండగడదామని పిలుపునిచ్చారు. ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు ఎక్కడ అని ప్రశ్నించారు. అన్ని వివరాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.
- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. అధికారం కోసం చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. ఈ ప్రభుత్వంపై మహిళలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అదే జగనన్న ఉంటే ఎన్నో సంక్షేమ పథకాలు అందేవని భావిస్తున్నారన్నారు.





వీడియో ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఒకటి మంత్రికి.. రెండోది ఎమ్మెల్యేకు!

- మూడు ఆప్షన్లు ఇచ్చి వీఆర్వో, సర్వేయర్ల బదిలీల కౌన్సెలింగ్
- లేఖలు లేని వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేసిన అధికారులు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన సర్వేయర్ల బదిలీల ప్రక్రియ

కర్నూలు(సెంట్రల్): సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలకు పాతరేసి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మంత్రి, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఉన్న వారికి అనువైన స్థానాలు ఇస్తున్నారు. ఎవరైనా ఆ స్థానాలను కోరుకుంటే వాటిలో మంత్రి చెప్పిన వ్యక్తి ఉన్నారని, ఎమ్మెల్యే సూచించిన వారికి ఇవ్వాల్సి ఉందని, మరో స్థానం కోరుకోవాలని నేరుగా చెబుతున్నారు. దీంతో ఆదివారం చేపట్టిన వీఆర్వోలు, సర్వేయర్ల బదిలీల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇదంతా అధికారుల తీరుతోనే జరుగుతోందని, ఇందులో కొందరు అధికారులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడంతోనే జరుగుతోందని చెబుతున్నారు.

అధికారుల తీరుపై సర్వేరయర్ల ఆగ్రహం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కర్నూలు, నంద్యాల డీఆర్వోలు సి.వెంకటనారాయణమ్మ, రామునాయక్ ఆధ్వర్యంలో వీఆర్వోలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సునయన ఆడిటోరియంలో కర్నూలు, నంద్యాల సర్వే ఏడీలు మునికన్నన్, జయరాముడు ఆధ్వర్యంలో సర్వేయర్లకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు.



సిఫార్సు లేఖలపై అధికారులను ప్రశ్నిస్తున్న సర్వేయర్లు

ముందుగా స్పౌజ్, ఆరోగ్యం, ఒంటరి మహిళ, మ్యూచువల్ విభాగాల్లో ర్యాంకుల ఆధారంగా వీఆర్వోలు, సర్వేయర్లను కౌన్సెలింగ్ పిలిచారు. వచ్చిన వారిలో ర్యాంకుల ఆధారంగా పిలిచి...మూడు ఆప్షన్‌లు ఇచ్చిన అధికారులు.. 'మూడింటిలో ఒక స్థానం మంత్రి సిఫారసు ఉంది.. మరొక స్థానం ఎమ్మెల్యే మనిషికి ఇవ్వాలి.. ఇంకో స్థానం కోరుకో' అని చెబుతుండడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఫార్సు లేఖల పేరిట ఫోకల్ స్థానాలను రిజర్వ్ చేసినట్లు చేయడం అన్యాయమని వాపోయారు. సిఫార్సు అంటే ఒకటో..రెండో ఉండాలి తప్ప.. ఎక్కువ స్థానాలను వారికే కేటాయించేలా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిఫార్సులు లేని వారికి నాన్‌ఫోకల్ పోస్టులను ఇస్తుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటప్పుడు కౌన్సెలింగ్ ఎందుకు నిర్వహించాలని ప్రశ్నించారు. ఎవరికీ కావాల్సిన స్థానాలు వారికి ఇచ్చుకుంటే సరిపోతుంది కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్ధరాత్రి వరకు..

సర్వేయర్లలో బదిలీల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. 800 మందిలో 294 మందికి ఐదేళ్ల సర్వీసు పూర్తి కాగా...మిగిలిన వారు రిక్వెస్టు జాబితాలో దరఖాస్తు చేసుకున్నారు.అలాగే వీఆర్వోల్లో గ్రేడు-2లో మొత్తం 77 మంది దరఖాస్తు చేసుకోగా ఇద్దరు హాజరు కాలేదు. ఇందులో ఐదేళ్ల సర్వీసు పూర్తైన వారు 30మంది ఉన్నారు. గ్రేడు-1 వీఆర్వోల్లో 14 మంది దరఖాస్తు చేసుకోగా 9 మంది మాత్రమే హాజరయ్యారు. కాగా, వీఆర్వోల బదిలీల కౌన్సెలింగ్ మధ్యాహ్నం 3 గంటలకే ముగిసింది. అయితే సర్వేయర్లు భారీ సంఖ్యలో ఉండడంతో రాత్రి వరకు కొనసాగింది. కాగా, సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సిఫార్సు లేఖల నేపథ్యంలో సర్వేయర్లు కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. దీంతో అధికారులు వారికి సర్దిచెప్పి నిబంధనలకు మేరకు ఖాళీలను చూపుతామని చెప్పి అర్ధరాత్రి వరకు కొనసాగించారు.

ముగిసిన కౌన్సెలింగ్

కర్నూలు (టౌన్): ఉమ్మడి జిల్లాకు సంబంధించి సచివాలయాల కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం ముగిసింది. ప్లానింగ్ కార్యదర్శులు 155 మంది, ఎమినీటీస్ కార్యదర్శులు 170 మందికి ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ.. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి ప్రస్తుత వార్డు, సొంత వార్డు మినహా ఇతర వార్డులకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామన్నారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ,డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బదిలీల ఒత్తిడితో మహిళా పోలీసు మృతి

- 14 రోజుల బాలింత అని చెప్పినా పట్టించుకోని అధికారులు
- రాత్రి ఒంటి గంట వరకు కౌన్సెలింగ్
- ఒత్తిడికిగురై హైబీపీతో మృత్యువాత



మృతి చెందిన దివ్య (ఫైల్)

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని 36వ వార్డు, మేదరి గేరీలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న దివ్య (26) బదిలీ ఒత్తిడితో అనారోగ్యానికి గురై మృతి చెందింది. ఆమె కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 15వ తేదీన పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ రోజు నుండి మెటర్నిటీ సెలవులో ఉంది. ఈ క్రమంలో కర్నూలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సచివాలయ మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియ నిర్వహించారు. అధికారుల ఆదేశాల మేరకు శిశువుతో 8 ఉదయం గంటలకు అక్కడికి చేరుకుంది. అయితే తన పరిస్థితి వివరించి త్వరగా కౌన్సెలింగ్‌కు పంపాలని అక్కడ విధుల్లో ఉన్న అధికారులను వేడుకుంది. తాను బాలింతను అని, సిజేరియన్ జరిగిందని వివరించినా ఎవరూ పట్టించుకోలేదు. అర్ధరాత్రి 1 గంటల సమయంలో కౌన్సెలింగ్ పూర్తి కావడం, ఆమెకు ఆస్పరి మండలం అలిగేరికి బదిలీ చేశారు. అప్పటి వరకు కార్యాలయం ఆవరణలో ఉన్న తన బిడ్డకు పాలు ఇచ్చేందుకు లోపలకి, బయటకు తిరిగి అలసిపోయింది. అలాగే దూర ప్రాంతానికి బదిలీ కావడంతో ఆందోళనకు గురైంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆదోనికి చేరుకున్న దివ్య కొద్ది సేపటి తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబీకులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని కర్నూలుకు రెఫర్ చేశారు. మార్గమధ్యంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో దివ్య మృత్యుఒడి చేరారు. మానవత్వం లేకుండా అధికారులు వ్యవహరించడంతో తన బిడ్డ మృతి చెందిందని దివ్య తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

ఏహెచ్‌ఏల బదిలీల్లో రచ్చరచ్చ

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పశు సంవర్ధక సహాయకుల (ఏహెచ్‌ఏల) బదిలీల వ్యవహారం రచ్చకెక్కుతోంది. నిబంధనల ప్రకారం కర్నూలు, నంద్యాల జిల్లా అధికారులు ఏకాభిప్రాయంతో బదిలీలు చేయాల్సి ఉంది. నంద్యాల జిల్లా అధికారి గోవిందునాయక్‌ను పూర్తిని పక్కన పెట్టి ఏకపక్షంగా వ్యవహరించారు. నంద్యాల జిల్లా అధికారి ముందే బదిలీలతో సంబంధం లేని పారా సిబ్బంది కర్నూలు జేడీ దగ్గరకు వచ్చి ''సార్ మేం బదిలీల లిస్ట్ తయారు చేస్తాం..సంతకాలు పెట్టండి' అని అడిగారు. అలాగే కానివ్వమని జేడీ చెప్పడంతో నంద్యాల జిల్లా అధికారి అవమానంతో కాగితాలు అక్కడే పడేసి వెళ్లిపోయారు. వెంటనే పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు ఫోన్ చేసి ఏహెచ్‌ఏల బదిలీల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన బదిలీలను తన ప్రమేయం లేకుండా ఏకపక్షంగా చేస్తున్నారని వివరాలను వారినే అడగాలని అన్నారు. బదిలీల్లో జరుగుతున్న అక్రమాలను నంద్యాల జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. నంద్యాల అధికారి ఫిర్యాదుపై డైరెక్టర్ కర్నూలు జేడీపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా కర్నూలు జేడీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. బదిలీల ప్రక్రియ చేపట్టలేదని, కేవలం ఆప్షన్‌లు మాత్రమే తీసుకున్నామని, సోమవారం మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలు చేపడుతామని తెలిపారు.

ప్రాధాన్యతను మరిచారు!

కర్నూలు(అగ్రికల్చర్): బదిలీల్లో వికలాంగులు, స్పౌజ్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ పట్టించుకోలేదు. వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో వీఏఏలు, వీహెచ్‌ఏల బదిలీ ప్రక్రియ ఆదివారం నిర్వహించారు. ఉద్యాన శాఖ బదిలీలు ఉద్యాన భవన్‌లో ఏపీఎంఐపీ పీడీ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగాయి. వ్యవసాయ శాఖలోని వీఏఏల బదిలీలు కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరిగాయి. మొదటి రోజున దాదాపు 200 మంది వీఏఏల బదిలీల ప్రక్రియను చేపట్టారు. మిగిలిన వీఏఏల బదిలీలు సోమవారం చేపడుతారు. వీహెచ్‌ఏల బదిలీలకు సంబంధించి శనివారం ఆప్షన్‌లు తీసుకున్నారు. ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

సెలవు రోజూ తప్పని తిప్పలు

- ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లతో కిక్కిరిసిన జెడ్పీ

కర్నూలు(అర్బన్): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆదివారం సెలవు అయినా ఇబ్బందులు ఎదుర్కొంటూ సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ -6 (డిజిటల్ అసిస్టెంట్) బదిలీలకు సంబంధించిన కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. కర్నూలు జిల్లాలో మొత్తం డిజిటల్ అసిసెంట్లు 375 మంది ఉండగా, వీరిలో ఐదు సంవత్సరాలు ఒకే ప్రాంతంలో సర్వీసును పూర్తి చేసుకున్న వారు 207 మంది, రిక్వెస్ట్ బదిలీలు కోరుతు 71 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్, కర్నూలు డీఎల్‌పీఓ టీ లక్ష్మి, కార్యాలయ ఏఓ ప్రతిమ కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగుల ఆప్షన్స్ తీసుకున్నారు. అలాగే నంద్యాల జిల్లాలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ -6 (డిజిటల్ అసిస్టెంట్లు) మొత్తం 404 మంది ఉండగా, ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 258, రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నా వారు 30 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన నంద్యాల జిల్లా ఉద్యోగుల కౌన్సిలింగ్ డీపీఓ లలితాబాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా, గ్రేడ్ -5 కార్యదర్శుల బదిలీలను ఈ నెల 28వ తేదిన పూర్తి చేశారు.

విశ్వేశ్వరయ్య భవన్‌లో ...

పీఆర్ ఎస్ఈ కార్యాలయం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 728 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉండగా, వీరిలో ఐదు సంవత్సరాలు ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించిన వారు 477 మంది ఉన్నారు. ఈ నెల 28వ తేదిన రాత్రి వరకు ఐదేళ్లు పూర్తి అయిన వారికి, స్పెషల్ కేటగిరి (మెడికల్, స్పౌస్ తదితరాలు) వారికి బదిలీలు నిర్వహించారు. ఆదివారం రిక్వెస్ట్ బదిలీలు కోరుతు దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి, డీఈఈలు రవీంద్రరెడ్డి, నివాసులు, నాగిరెడ్డి, ధనిబాబు, కర్రెన్న, డీఏఓలు, ఏఈలు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి

జి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ జీ పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం హాల్‌లో నిర్వహించారు. ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి జిల్లాలోని ఒకే ప్రాంతంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 570 మంది, రిక్వెస్ట్ బదిలీలను కోరుతూ 131 మంది దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కే తులసీదేవి ఆధ్వర్యంలో కొనసాగింది. సహాయ సంక్షేమాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండల్ని కొల్లగొట్టి.. ఎర్రమట్టి దోపిడీ



ఎర్రచందనం చెట్టును నరికేసిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: కొండల్లో ఎర్రమట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వానికి రుసుం చెల్లించకుండా కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మిగనూరు మండలంలోని మాచుమాన్‌దొడ్డి, నవోదయ పాఠశాల ఎదురుగా, బనవాసి ఫారెస్ట్, ఎస్.నాగాలపురం, హనుమాపురం, వెంకటగిరి గ్రామ కొండల్లో ఎర్రమట్టిని తరలిస్తున్నారు. బనవాసి ఫారంలో చాలా చోట్ల గోతులు తవ్వి మట్టిని తరలించారు. కొన్ని చోట్ల ప్రొక్లెయిన్లు ఉపయోగిస్తున్నారు. లక్షల రూపాయలు విలువ చేసే అటవీ సంపదను తరలిపోతుంది.



ఎర్రమట్టి కోసం టేకు చెట్ల పక్కన తవ్విన గుంతలు

అక్రమార్కులకు ఆర్థిక వనరుగా..

కొండలకే పరిమితమైన తవ్వకాలు ఇప్పుడు నేరుగా బనవాసి ఫారంలో టేకు చెట్లు పెంచుతున్న వనంలోకి వచ్చాయి. టేకు చెట్లు అడుగు వరకు ఉన్న మట్టిని తీస్తున్నారు. చెట్ల నరికివేసి వాటిని కూడా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కళకళాడిన బనవాసి ఫారం నేడు అక్రమార్కులకు ఆర్థిక వనరుగా మారిపోయింది. గతంలో ఇక్కడ పనిచేసి వలంటీర్లు ఇప్పుడు లేకపోవటంతో కాంట్రాక్టర్లు టాక్టర్లలో ఎర్ర మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

అటవీకి ప్రాంతంలో యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తూ చెట్లను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. అటవీశాఖ అధికారులు ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో ఉండటంతో పర్యవేక్షణ లోపించింది. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు బరితెగించారు. బనవాసి ఫారెస్ట్ పరమాన్‌దొడ్డికి వెళ్లే దారి సమీపంలోని స్మార్ట్ సిటీ దగ్గర ఎర్ర చందనం చెట్లను నరికివేశారు. ఎవరు గుర్తించకపోతే వాటని రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ఎర్ర చందనం చెట్లు నరికివేతకు గురైనా ఫారం అధికారులకు కనిపించకపోటం గమనార్హం.

కఠిన చర్యలు తీసుకుంటాం

అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫారంలో ఇంతకు ముందే మట్టిని తరలించరాదని చెప్పాం. తరలిస్తున్నట్లు మాకు సమాచారం ఇస్తే పట్టుకుంటాం. కాంట్రాక్టర్లు తరలిస్తే కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగా వించి వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయ నీటి గుండంకు కంచె ఏర్పాటు



కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని నీటి గుండం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రతి శుక్ర, శనివారం అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు తరలి వస్తుంటారు. ఈక్రమంలో కోనేరులో కాకుండా నీటి గుండంలోకి ఈతకు వెళ్లి ఏడాదికి ఇద్దరు లేదా ముగ్గురు మృత్యువాతపడుతున్నారు. ఈక్రమంలో ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ఆలయ నీటి గుండం వద్ద ప్రమాదాల నివారణకు కంచె ఏర్పాటు చేయించారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ

● వెండి కిరీటాలు అపహరణ

నందవరం: పొనకలదిన్నె గ్రామంలో సుంకులమ్మ దేవి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలో అమ్మవారికి చెందిన వెండి కిరీటాలు తస్కరించారు. ఆలయ పూజారి అవుకు సుంకన్న తెలిపిన వివరాల మేరకు.. దేవాలయంలో సుంకులమ్మ దేవి అమ్మవారికి 1000 గ్రాములు, 500 గ్రాములు ఉన్న రెండు వెండి కిరీటాలను గ్రామ పెద్దలు, దాతల సహాయంతో చేయించారు. శనివారం ఉదయం పూజ చేసి పూజారి ఇంటికి వెళ్లిపోయారు. సాయంత్రం ఆలయానికి వచ్చి చూసేసరికి అమ్మవారి కిరీటాలు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించి రూ. 1.50 లక్షలు విలువ చేసే రెండు వెండి కిరీటాలను తస్కరించినట్లు తెలుస్తోంది. ఆలయ పూజారి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాధవరం వంకలో మొసలి



నీటి గుంతలో ఉన్న మొసలి

మంత్రాలయం: ఈ మధ్య కాలంలో తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కువగా మొసళ్లు దర్శనమిస్తున్నాయి. ఆదివారం మాధవరం వంకలో మొసలి కనిపించింది. వంక చుట్టు పక్కలా రైతులు గమనించి భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారిలో బ్రిడ్జిపై వెళ్లే భక్తులు ఆసక్తిగా చూశారు. అయితే, మొసళ్లు తరచూ కనిపిస్తుండటంతో నది తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆత్మకూరురూరల్: శుభకార్యానికి వెళ్తున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆత్మకూరు పట్టణ శివారులో ఈ ఘటన జరిగింది. స్థానిక చర్చికాలనీకి చెందిన షంషాబీ(40) అనే మహిళ ఆదివారం ఉదయం పట్టణంలో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు తమ్ముడి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గ మధ్యలో కర్నూలు – గుంటూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఆమె చీరకొంగు జారి బైక్ చక్రానికి చుట్టుకుంది. ఈఘటనలో ఆమె బైక్‌పై నుంచి కిందపడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఈ మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి కుటుంబ వివరాల తెలియాల్సి ఉంది.

పోతిరెడ్డిపాడు గేట్లకు మరమ్మతులు



గేట్ల మరమ్మతులు జరుగుతున్న దృశ్యం

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేయాల్సిన సమయంలో అధికారులు మరమ్మతులు చేపట్టడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. డ్యాంకు వరద పెరుగుతుండటంతో నీటిని ఏ క్షణానా అయినా విడుదల చేయొచ్చు. రూ.13 లక్షల నిధులతో పోతిరెడ్డిపాడు 2, 5 గేట్ల మరమ్మతులు చేస్తున్నారు. గేట్ల రోలర్స్, పండ్ల చక్రాలు తదితరాల మరమ్మతులు చేసి కొత్తవాటిని అమర్చుతున్నారు. ఈ విషయమై ఈఈ నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా మరో రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి కానున్నట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు



రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌గా నిలిచిన బాలుర ప్రకాశం జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ అండర్–18 బాల, బాలికల చాంపియన్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో ప్రకాశం (ప్రథమ), కర్నూలు (ద్వితీయ), విశాఖపట్నం (తృతీయ), బాలికల విభాగంలో గుంటూరు (ప్రథమ), అనంతపురం (ద్వితీయ), తూర్పు గోదావరి (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఆదర్శ విద్యా మందిర్ డైరెక్టర్ డాక్టర్ బి. హరికిషన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటి పదిమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రగ్బీ ఇండియా ప్రతినిధి నోయల్ మ్యాథ్యు, రగ్బీ, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు

జూపాడుబంగ్లా: కొత్తవారెవ్వరైనా వచ్చి మాయమాటలు చెబితే నమ్మిమోసపోవద్దని పోలీసులు ఎంతచెప్పినా గ్రామీణ ప్రజల్లో మార్పురావటం లేదు. ఈనేపథ్యంలో ఆదివారం సాయంత్రం పారుమంచాల గ్రామానికి సురేష్ అనే వ్యక్తి చేరుకొని తనకు రూ.200లు చెల్లిస్తే దానికి రశీదు ఇవ్వటంతో పాటు త్వరలో కుట్టుమిషన్ ఇస్తామని నమ్మబలికాడు. అతని మాయమాటలు నమ్మిన గ్రామస్తులు ఒక్కొక్కరు రూ.200ల చొప్పున అతని చేతిలో పెట్టారు. గ్రామస్తులిచ్చిన డబ్బులకు గాను అతను కేవలం రూ.155లకు రూరల్ డెవలప్‌మెంటు అథార్టీ, రేవతి బిల్డింగ్, బిసైడ్ మైత్రివనం, అమీర్‌పేట్, హైదరాబాదు పేరున రశీదు ఇవ్వటంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తమకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎలా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మాయగాన్ని నిలదీయటంతో అతను పొంతనలేని సమాధానం ఇచ్చాడు. దీంతో అతనిపై గ్రామస్తులకు అనుమానం రావటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ సంజీవ పారుమంచాలకు చేరుకొని మోసగాడిని నిలదీశాడు. అతని వద్ద నుంచి ఐడీకార్డును స్వాధీనం చేసుకున్నాడు. ఐడీకార్డులో సిడ్కో జిల్లా కోఆర్డినేటర్ సురేష్, కర్నూలు అని ముద్రించి ఉంది. తొమ్మిది మంది గ్రామస్తుల నుంచి అతను వసూలు చేసిన మొత్తాన్ని వారికి ఏఎస్ఐ తిరిగి ఇప్పించి అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు.

బేస్ బాల్ క్రీడాకారుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల బేస్ బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపికకు ఆదివారం పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, సుబ్బారావు, ఏపీరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులను సత్యసాయి జిల్లాలో జూలై 13, 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వనాథ్, దేవేంద్ర నరసింహ, సురేష్‌నాయుడు, షేక్షావలి, శ్రీనివాసరెడ్డి, పుల్లయ్య, రామేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పౌరాణికాలకు ఆదరణ తగ్గలేదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీవీ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గలేదని పారిశ్రామిక వేత్త, సినీనటులు బీవీ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో స్వేచ్ఛ నాటక ప్రదర్శనలో భాగంగా శ్రీకృష్ణ రాయబారంలోని ఒక సన్నివేశం ప్రదర్శన జరిగింది. సభ ప్రారంభంలో శ్రీకృష్ణ రాయబారంలోని పడక సీను సన్నివేశాన్ని శ్రీకృష్ణునిగా భాస్కర యాదవ్, అర్జునుడిగా కేవీ రమణ, దుర్యోధనుడిగా చల్ల నవీన్‌కుమార్ నటించారు. ఈ సందర్భంగా బీవీ రెడ్డి మాట్లాడుతూ తన చిన్నతనంలో రాత్రి 10 గంటలకు నాటకం ప్రారంభమైతే ఉద యం 6 గంటల వరకు కొనసాగేవన్నారు. ఎన్‌టీ రామారావుతో పాటు ఎందరో సినీనటులతో తనకు పరిచయం ఉందని, సినిమాలకు ఆదరణ క్రమేపీ తగ్గడం విచారకరమన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ కొత్తతరం నటులను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షులు పత్తిఓబులయ్య, బలగం సినిమా ఫేమ్ సురభి లలిత మంజు గోవర్ధన్ రెడ్డి, కళాకారులు బీవీ రెడ్డి, బీసీ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, దస్తగిరి, పి.రాజారత్నం, మహమ్మద్‌మియ్య పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలి



సమావేశమైన సేవ్ వక్ఫ్..సేవ్ రాజ్యాంగం జేఏసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సేవ్ వక్ఫ్..సేవ్ రాజ్యాంగం జేఏసీ కన్వీనర్ మౌలానా సయ్యద్ జాకీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై నేటి (సోమవారం) సాయంత్రం 5 గంటలకు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసభకు రాజకీయాలకు అతీతంగా హాజరై మద్దతు తెలపాలన్నారు. మంగళవారం మౌర్య ఇన్‌కు ఎదురుగా ఉన్న మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కో కన్వీనర్లు ఎంఏ హమీద్, ఎస్ఎండీ షరీఫ్‌లతో కలసి మాట్లాడారు. బహిరంగ సభకు ఎంతో ప్రాముఖ్యత ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా చేసినట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముస్లిం సంస్థల వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడంతో చట్టానికి సవరణలు చేశారని విమర్శించారు. ఆయన అధికారంలోకి వచ్చాక మసీదులు, మదరసాలు, కబరస్తాన్‌ల భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మరోవైపు ఇప్పటికే ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన పది రకాల చట్టాలను రద్దు చేసినట్లు చెప్పారు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ చర్యలను ముక్తకంఠంతో ఖండిస్తూ చేపట్టే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి, యువజన, మహిళ సంఘాల ప్రతినిధులను కోరారు.

పట్టు వదలని 'విత్తు' మార్కుడు



అన్నదాత ఆశలను అడియాసలు చేస్తు వరుణుడు ముఖం చాటేయడంతో రైతులకు కన్నీళ్ల కష్టాలు మొదలయ్యాయి. వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో రైతులు ఖరీఫ్‌లో వర్షాధారం కింద పంటలు సాగు చేశారు. అయితే వర్షం జాడలేక పంటలు వాడు ముఖం పడుతున్నాయి. పెట్నికోటకు చెందిన రైతు గొంగటి వెంకట్రామిరెడ్డి ఆదివారం ట్యాంకర్‌తో పత్తి పంటకు నీరు అందించాడు. నెల రోజుల క్రితం నాలుగు ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాడు. సగం భూమిలో మొలకెత్తగా మిగిలిన చోట్ల మొలకెత్తలేదు. దీంతో ట్యాంకర్‌తో విత్తనం మొలకెత్తని చోట పైపుతో నీళ్ల పడుతూ కనిపించాడు. వర్షం లేకనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

– కొలిమిగుండ్ల

జూలైలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు



సమావేశానికి హాజరైన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కర్నూలు జిల్లా మహాసభలను జూలై మూడో వారంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం కన్వీనింగ్ కమిటీ నిర్ణయించింది. ఆదివారం టీజీవీ కళా క్షేత్రంలో నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుస్సేన్, జిల్లా కన్వీనర్ నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభల నిర్వహణపై చర్చించి జూలై మూడో వారంలో జరపాలని నిర్ణయించారు. ఈ మహాసభలకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించాలని నిర్ణయించారు. కాగా, మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘాన్ని ఎనుకున్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల, ఆదోని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బసప్ప, చంద్రమోహన్, ఎమ్మిగనూరు డివిజన్ గౌరవాధ్యక్షుడు దేవేంద్రమూర్తి, అధ్యక్షుడు షబ్బీర్, ఆలూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కృష్ణ, కర్నూలు జిల్లా నాయకులు సునీల్‌కుమార్, బ్రహ్మయ్య, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు, నగర ఉపాధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

వేటగాడు అరెస్టు

చాగలమర్రి: నల్లమల అటవీ ప్రాంతంలో అడవి పందిని వేటాడి చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. ఆదివారం డి.వనిపెంట సెక్షన్ బీట్ ఆఫీసర్ జె.శుభాష్ వివరాలు వెల్లడించారు. కేపీ తండా గ్రామానికి చెందిన మూడె బాలునాయక్ అనే వ్యక్తి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం అడవి పందిని వేటాడి చంపాడు.తర్వాత దానిని అక్కడే మంటల్లో కాల్చుతుండగా సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 3 మచ్చు కత్తులు, పంది కళేబరం స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితుడిని రిమాండుకు తరలించినట్లు జె.శుభాష్ తెలిపారు. అయితే, సంఘటనా స్థలంలో నిందితుడు వేటకు వినియోగించిన పేలుడు పదార్థాలను అటవీ అధికారులు అక్కడే వదిలేసివచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం



గోల్డ్ మెడల్ సాధించిన జశ్వంత్

నంద్యాల(న్యూటౌన్): పట్టణానికి చెందిన మహంకాళి జశ్వంత్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో గోల్డ్ మెడల్, సింగిల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్, సెక్రటరీ అంకమ్మ చౌదరి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన గోవాలో అండర్–13 ర్యాంకింగ్ నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు.ఇందులో జశ్వంత్ ప్రతిభ చాటి బంగారు పతకంతో పాటు ట్రోఫీ అందుకున్నట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారుడిని ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ నంద్యాల జిల్లా సెక్రటరీ వంశీధర్, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

మంటల్లో చిక్కుకున్న లారీ



చెర్వుతండ రైల్వే బ్రిడ్జి కింద మంటల్లో చిక్కుకున్న లారీ

తుగ్గలి: లారీ టైర్లు వేడెక్కి మంటలు వ్యాపించిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని చెర్వుతండ వద్ద చోటు చేసుకుంది. ముంబై నుంచి చెన్నైకు బెల్లం పానకం ట్యాంకర్‌తో వెళుతున్న లారీ మార్గమధ్యంలో చెర్వుతండ బ్రిడ్జి కిందికి రాగానే టైర్లు హీటెక్కి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఆ లారీ ఎక్కడ పేలుతుందోనని అక్కడ గుమికూడిన జనం బెంబేలెత్తి పోయారు. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం కాలి పోయింది. స్థానికులు సమాచారం అందించడంతో పత్తికొండ నుంచి ఫైర్ ఇంజిన్ వెళ్లి మంటలను ఆర్పేయడంతో ప్రమాదం తప్పింది. రైల్వే బ్రిడ్జి కింద లారీకి మంటలు వ్యాపించడంతో రైల్వే అధికారులు సైతం అప్రమత్త మయ్యారు. ప్రమాదంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు కాసేపు అంతరాయం కలిగింది.

సవరణ

ది. 29-06-2025న, సాక్షి తెలుగు దినపత్రిక మొదటి పేజీ నందు, శ్రీ లక్ష్మీ విద్యా సంస్థల ఛైర్మన్ శ్రీ పి.దీక్షిత్ గారికి ది ఇన్నోవేటర్ ఇన్ ఎడ్యుకేషన్ క్యాటగిరిలో ఇండియా నుండి ఎంపికైన సందర్భంగా **"హౌస్ ఆఫ్ లార్డ్స్, బ్రిటిష్ పార్లమెంట్ యునైటెడ్ కింగ్‌డమ్ నందు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ"** నుండి అని ప్రకటనలో ప్రచురించబడినది. దానిని **"హౌస్ ఆఫ్ లార్డ్స్ బ్రిటిష్ పార్లమెంట్, యునైటెడ్ కింగ్‌డమ్"** గా గమనించగలరు అని మనవి.

రాఘవుడి దర్శనానికి దారేది?

● సింగిల్ ఎంట్రెన్స్‌తో భక్తుల నిరీక్షణ
● తోపులాటలతో ఉక్కిరి బిక్కిరి.!



శ్రీమఠం ప్రధాన ద్వారం వద్ద దర్శనానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం : శ్రీమఠం అధికారుల తీరు భక్తుల తోపులాటకు దారి తీసింది. సింగిల్ ఎంట్రన్స్‌తో భక్తులకు ముచ్చెమటలు తెప్పించింది. వృద్ధులు, చిన్నారులను కన్నీళ్లు పెట్టించింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. గురు, శని, ఆదివారాలు భక్తులు పోటెత్తుతున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా శ్రీమఠం అధికారులు ఏర్పాట్లు చేయడంలో కాస్త అలసత్వం కనబడుతోంది. మొన్నటి వరకు శ్రీమఠం ప్రాంగణంలోకి ప్రవేశించాలంటే చుట్టూరా మూడు ప్రధాన ద్వారాలతోపాటు, ప్రధాన ద్వారం ఇరువైపులా చిన్న ద్వారాలు నుంచి అవకాశం కల్పించేవారు. ద్వారాలతో రద్దీ తక్కువగానే ఉన్న క్యూలైన్లలో భక్తుల బారులు తీరే పరిస్థితి. క్యూలైన్లు పెంచాల్సి వస్తుందేమోనని.. లేక ప్రాంణగంలో రద్దీ తగ్గించాలనో.. కొత్త పద్ధతిని ఆచరణలోకి తెచ్చారు. ఆదివారం దర్శనాలకు వచ్చిన భక్తులను కేవలం ప్రధాన ద్వారం నుంచి ప్రవేశం కల్పించారు. పోలీసులు, సెక్యూరిటీగార్డులతో రోప్ ఏర్పాటు చేసి భక్తులకు బ్రేకులు వేస్తూ వచ్చారు. అయితే రోప్‌తో భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. శ్రీమఠంలోకి వచ్చేందుకు తోసుకుంటూ ఎగబడ్డారు. తోపులాటతో వృద్ధులు, చిన్నారులు కన్నీళ్లు సైతం పెట్టుకున్నారు. లక్షలాది మంది భక్తులకు ఒకే ఎంట్రెన్స్ పెట్టడంతోనే ఇబ్బందులు తలెత్తాయి. ఇన్నాళ్లూ ఇలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులు ఆయా ద్వారాల నుంచి సాఫీగా మఠంలోకి వెళ్లి వచ్చే పరిస్థితి. ఈ అనాలోచనతో దర్శనాలకు బాగానే సమయం పట్టింది. కూలైన్లతో భక్తులకు ఎలాంటి వసతులు కూడా లేకపోవడంతో తలలు పట్టుకున్నారు. కనీసం క్యూలైన్లతో తాగునీటి సౌకర్యమైనా కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఇక అన్నపూర్ణ భోజనశాలలోనూ అదే పరిస్థితి. గంటల తరబడి భక్తులు క్యూలైన్లలోనే కూర్చుండిపోయారు. సాధారణ రోజుల్లోనే ఇలా ఉంటే రాఘవేంద్రుల ఆరాధనోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉంటాయోనని భక్తులు వాపోయారు.



భక్తుల తోపులాటతో రోదిస్తున్న చిన్నారి